క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

గద్వాల క్రైం: పెళ్లి వేడుకల్లో దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరు యువకులను బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన కుర్వ అమృత్ ఈనెల 10న వివాహం అయింది. ఈ క్రమంలో సాయంత్రం పెళ్లి వేడుకల్లో డీజే నిర్వాహకుడితో పెళ్లి కుమారుడు స్నేహితులు మద్యం మత్తులో పాటల విషయంలో ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన వారు కత్తులతో దాడి చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన డీజే నిర్వాహకుడు జావేద్, విగ్నేష్ ఫిర్యాదు మేరకు మనోజ్, పరుశరాముడుని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రహదారిపై కూలిన చెట్టు



అలంపూర్: పట్టణ సమీపంలోని ప్రధాన రహదారిపై చెట్టుకొమ్మలు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం వీచిన ఈదురు గాలులకు చెట్టుకొమ్మలు నేలరాలాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చెట్టుకొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో అర్చకులు బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయశర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో పీఠాధిపతి పూజలు



అలంపూర్: జోగుళాంబ ఆలయంలో విజయవాడ పీఠానికి చెందిన అష్టాక్షరి సంపత్‌కుమార్ రామానుజన్ జీయర్‌స్వామి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ స్వామికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి చిత్రాన్ని పీఠాధిపతికి ఈఓ అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, స్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఎర్రవల్లి: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు గురువారం నుంచి టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్య అధికారి డాక్టర్ భువనేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి వచ్చేనెల 14 వరకు ఆయా గ్రామాల వారీగా టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చేపట్టిన మరమత్తు పనుల్లో భాగంగా గురువారం అయిజ, గట్టు, రాజోళి మండలాల్లోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మానవపాడు: మండల కేంద్రంలోని విద్యుత్ ఉపకేంద్ర పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరాఫరాలో గురువారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ చిన్న సుబ్బరాయుడు ఒకప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తూతూమంత్రంగా గ్రామసభలు

- గ్రామసభల్లో కానరాని ప్రజల భాగస్వామ్యం
- అవగాహన కల్పించని అధికారులు

మానవపాడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహించాల్సిన గ్రామసభలను అధికారులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించాల్సిన గ్రామ సభలను అధికారులు సంతకాలు పెట్టి మమా అనిపిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ సభలే కీలకం

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామసభల నిర్వహణ ఎంతో కీలకం. ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రజలు గ్రామసభల్లో పాల్గొన్ని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం చర్చిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల నమోదు వివరాలు, ప్రభుత్వాలు చేపట్టే కొత్త పథకాలు, పనులపై ప్రజాభిప్రాయాలను గ్రామ సభల ద్వారానే తెలుసుకుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న గ్రామసభలు మండలంలో నామ మాత్రంగానే సాగుతుండటంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గ్రామసభల నిర్వహణ గాలి కొదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.



పల్లెపాడులో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

నిర్వహణ తీరు

గ్రామ పంచాయతీల్లో సభ నిర్వహించే తేదీని ఒకరోజు ముందుగానే తెలియజేసి, పంచాయతీతో పాటు అనుబంధ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించే తేదీని సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో టాంటాం(దండోరా) వేయించాలి. నిబంధనల ప్రకారం విధిగా 18 శాఖల అధికారులు, జనాభాలో సుమారు 20 శాతం మంది ప్రజలు గ్రామసభకు హాజరయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. రెండు నెలలకోసారి, సర్పంచ్‌లు, ప్రత్యేక అధికారులు పంచాయతీల్లో గ్రామ సభ నిర్వహించాలి. కనీసం 50 మందితో గ్రామ సభ నిర్వహించవచ్చు. కోరం లేని పక్షంలో సభ వాయిదా వేయవచ్చు. సభకు హజరయ్యే అధికారులు గ్రామంలోని సమస్యలు నమోదు చేసుకోని వాటి పరిష్కరం కోసం కృషి చేయాలి. అభివృద్ధి పనులు, కార్యచరణపై చర్చ జరుగుతుంది. పంచాయతీల ఆదాయ, వ్యయాలపైన కార్యదర్శులు నివేదికలు చదివి వినిపిస్తారు.

కనిపించని భాగస్వామ్యం

మండలంలోని చాలా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలకు కనీసం పది మంది కూడా రావడం లేదు. ప్రజా ప్రతినిధులు, మాజీ ఎంపీటీసీలు, అంగన్‌వాడీలు మాత్రమే హాజరవుతున్నారు. గ్రామసభల నిర్వహణ సమయంలో ప్రజలకు సమాచారం అందించక పోవడం, సభలో చర్చించిన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామసభలకు ఆదరణ తగ్గింది. గ్రామాల్లోని సమస్యలకు పరిష్కారం చూపితేనే గ్రామసభలకు ఆదరణ పెరుగుతుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలకు పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గ్రామసభలో చర్చించిన సమస్యలు ఏవీ పరిష్కారం కావడం లేదు. సభలో చర్చించిన సమస్యలు పరిష్కరించాలి. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు గ్రామసభలకు దూరంగా ఉంటున్నారు.

-గొల్ల నర్సింహులు మాజీ సర్పంచ్, మానవపాడు

పేరుకే గ్రామసభలు



గ్రామ సభలకు వార్డు మెంబర్లు, అధికారులు వెళ్లి సంతకాలు పెట్టి ఎప్పుడు వెళ్దామా అని ఉంటున్నారు. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పేరుకు మాత్రమే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. దీంతో సభలో ప్రజల భాగస్వామ్యం ఉండటం లేదు.

-నర్సింహులు, మాజీ సర్పంచ్, చండూరు

ప్రజల భాగస్వామ్యం పెరగాలి

గ్రామ సభల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలి. సభల నిర్వహణపై కార్యదర్శులు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. గ్రామ సభల నిర్వహణ సమాచారం తెలుసుకున్న ప్రజలు స్వచ్ఛందంగా గ్రామసభకు హాజరుకావాలి. గ్రామసభల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు వీలుంటుంది. ప్రజల భాగస్వామ్యంతో సమస్యలు పరిష్కరిస్తాం.

-భాస్కర్ ఎంపీడీఓ, మానవపాడు

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ఎర్రవల్లి: రైతులు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని జింకలపల్లి, కొండేరు గ్రామాల్లో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన తేమశాతం వచ్చేలా వడ్లను ఎండబెట్టుకొని కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ. 2,320, సాధారణ రకానికి రూ.2,300 లతో పాటు సన్నరకాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కుర్మయ్య, ఏఈఓ ప్రవల్లిక, మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు సోమనాద్రి, రుక్మాందర్‌రెడ్డి, బీచుపల్లి, వెంకటేష్, బలరాముడు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



జింకలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దొడ్డెప్ప

వృత్తివిద్యా కళాశాల ఏర్పాటు చేయాలి

అయిజ: అయిజ పట్టణంలో వృత్తి విద్య కళాశాలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ నియోజకవర్గాల్లో 16 ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) వృత్తి విద్యా కళాశాలలు మంజూరు చేసిందన్నారు. అయిజలో ప్రభుత్వ ఏటీసీ వృత్తి విద్యా కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమ్‌సేనరావు, వీరయ్య ఆచారి, లక్ష్మణ్ ఆచారి, నరసింహ, ముదిరాజ్, రఘు, రాజు, నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి

మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ధరూరు: మండల కేంద్రంలోని ఎంపీహెచ్‌ఎస్ అల్వలపాడు పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఏ-2 పరీక్షలు పరిశీలించి, మార్కుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా 23న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిని వివరించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

భక్తిశ్రద్ధలతో పునఃప్రతిష్ఠ వేడుకలు

వనపర్తి టౌన్: స్థానిక పాతబజార్‌లోని కాళికాంబ సమేత కమలేశ్వర విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలో రోడ్ల విస్తరణలో భాగంగా రోడ్డుకు అడ్డుగా ఉన్న కాళిమాతా ఆలయాన్ని ఏడాదిన్నర కిందట తొలగించడంతో పునఃప్రతిష్ఠకు ఆలయ కమిటీ సభ్యులు పూనుకున్నారు. గతానికి భిన్నంగా కాళీమాతాతో పాటుగా కమలేశ్వర మూర్తుల విగ్రహ స్థాపనతో ఆలయాన్ని నిర్మించారు. పునః ప్రతిష్ఠాపనలో భాగంగా మూడు రోజులుగా గణపతి హోమం, సుబ్రమణ్య హోమం, రక్షాబంధం, యంత్ర ప్రతిష్ఠ పూజల క్రతువులు బుధవారం పునఃప్రతిష్ఠాపన ఘట్టంతో ముగిశాయి. వేకువజాము నుంచి యంత్ర, కలశ, హోమాదులు, వాస్తుకట్టు, యంత్రాలను ఆవాహనం చేసి, ఆలయ ప్రదక్షిణతో పాటుగా గరక పూజ నిర్వహించి, దేవతా విగ్రహ మూర్తులకు జీవకళ ఉట్టిపడేలా మంత్రోచ్చరణ చేయడంతో భక్తుల అఖండ శరణు ఘోషల మధ్య జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామిజీ పర్యవేక్షణలో వేద పండితులు విజయవాడ దుర్గ రూపంలో విరాజిల్లుతున్న అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం తొలి దర్శనం కామధేను చేసిన అనంతరం భక్తులకు దర్శనానికి అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యే రూ.3.5లక్షలు విరాళం అందించారు. రూ. లక్ష విరాళం ఇచ్చిన తిరుమల మహేష్‌ను ప్రత్యేకంగా ఆలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు పాకనాటి కృష్ణయ్య, బి.కృష్ణ, స్థానిక నాయకులు బొంబాయి మన్నెంకొండ, పరశురాం, వాకిటి ఆదిత్య, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

బాలల సంరక్షణపై అవగాహన



అయిజ: మండలంలోని బింగిదొడ్డిలో బుధవారం ఉపాధి కూలీలకు డీసీపీఓ నరసింహ బాలల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం నరసింహ మాట్లాడారు. బాలల సమస్యల పరిష్కారం కోసం 1098ను సంప్రదించాలన్నారు. బాల్య వివాహాలు, తల్లిదండ్రులు లేని పిల్లలు, భిక్షాటన చేస్తున్న పిల్లల గురించి అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మల్దకల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం అనంతరం వారికి దుస్తులు అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఏపీఎం నరహరి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు టీకాలు వేయించాలి



శాంతినగర్: పశువులకు వ్యాధి సోకక ముందే టీకాలు వేయించాలని డాక్టర్ స్వరూపరాణి పశుపోషకులకు సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు, మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం శాంతినగర్ పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. మొత్తం 599 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, లతీఫ్, బుచ్చమ్మ, రవి, పాలాగు, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణగౌడ్ పాల్గొన్నారు.

చైతన్యవంతులుగా చేసేందుకు దోహదం

మానవపాడు: ప్రజలను చైతన్యవంతులుగా చేసేందుకు గ్రంథాలయాలు దోహదపడుతాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను విజ్ఞానవంతులను చేసేందుకు గ్రంథాలయాలు ఉపయోగపడుతాయన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో విధిగా పుస్తకాలు చదవడానికి ప్రత్యేక సమయం కేటాయించాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తకాల కొరత ఉందని త్వరలోనే పాఠకులకు మంచి పుస్తకాలు, నిరుద్యోగులకు ఉపయోగపడే పాఠ్య పుస్తకాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మల్లెపోగు రమేష్, జగ్గల ప్రభాకర్, డీలర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలు పరిశీలిస్తున్న నీలి శ్రీనివాసులు

సోనియా, రాహుల్‌పై చార్జిషీట్ దారుణం

గద్వాలటౌన్: నేషనల్ హెరాల్డ్ అంశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)చార్జిషీట్‌లో చేర్చడాన్ని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సరిత మాట్లాడారు. సోనియా, రాహుల్ పేర్లను చార్జిషీట్‌లో చేర్చడం దారుణమన్నారు. ఇదీ ముమ్మాటికీ ప్రతీకార చర్యనేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ పోరాడుతున్నందువల్లే తప్పుడు కేసులతో ఆయన నోరు నొక్కేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. విపక్ష నేతలపై ప్రతీకార రాజకీయాలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ నేతలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, మాజీ వైస్ చైర్మన్ శంకర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, నాయకులు ఇసాక్, శ్రీనివాస్‌గౌడ్, డీఆర్ శ్రీధర్, భాస్కర్‌యాదవ్, జగదీష్, ఆనంద్‌గౌడ్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

అలంపూర్: గర్భిణిగా ఉన్నప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చేవరకు తల్లి పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ సుజాత సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్థానిక హరిజనవాడ పాఠశాలలో అలంపూర్ సెక్టార్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. బిడ్డ ఉండవలసిన బరువు, ఎత్తు, పోషణ స్థితి గురించి సీడీపీఓ వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నర్గీస్, డాక్టర్ రేష్మ, అంగన్‌వాడీ టీచర్లు ఏమేలమ్మ, శాంతమ్మ, నర్మద, భారతి, రూపప్రియ, మాధవి, పుష్పావతి, సావిత్రి, వరలక్ష్మి, ఆశ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



పోషకాహారంపై వివరిస్తున్న సీడీపీఓ సుజాత

వైద్యసేవలు అందుబాటులోకి తేవాలి

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం ఆస్పత్రిని వినియోగంలోకి తీసుకురావడం లేదని మండిపడ్డారు. మంత్రులు ఆస్పత్రిని పరిశీలించిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గ ప్రజలు వైద్యం కోసం పక్క రాష్ట్రానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా జీతాలు రాలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జీకే ఈదన్న, పరంజ్యోతి, నాయకులు వెంకటేశ్వర్లు, శేషన్న, దేవన్న, అనిల్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

మానవపాడు: విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలు నియంత్రించవచ్చని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మోటార్ వాహనాల చట్టం ప్రకారం నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదు చేశారు. ట్రిపుల్ రైడింగ్, వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లు, హెల్మెట్ లేకపోవడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని చింతరేవులలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అయిజ: ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసరావుతో కలిసి మండల కేంద్రంలోని వివిధ విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తనాల పాకెట్లు, వాటిపై ముద్రించిన వివరాలు నమోదు చేసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చండి మహాప్రభో..

కేటీదొడ్డి: మండలంలోని ఉమిత్యాల తండాలోని పలు వార్డుల్లో రెండు రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ కృష్ణమోహన్‌ను వివరణ కోరగా తండాలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సరఫరా చేసే పైప్‌లైన్‌లో చెత్త పేరుకపోవడంతో శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు.



బోరు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జన్కో కాలనీలో బుధవారం సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విన్యాసాలతో క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బహుల అంతస్తుల్లో ప్రజలు ప్రమాదాల బారినపడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నాగార్జున్, శ్రీనునాయక్, నర్సింహారెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.